


TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE




ప్రచురణ : తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : జి రాజేష్ | సంపుటి : 03 | సంచిక : 184 | పేజీలు : 06 | బుధవారం 30 - 09 - 2026 | వెల : 4/-

# క్యూర్ పరిధిలో మరో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన

- రూ.43.20 కోట్ల నిధులతో నిర్మాణం
- నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్‌లో ఇందిరమ్మ టవర్‌కు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు
- లబ్ధిదారులకు ఫ్లాట్ల కేటాయింపు పత్రాలను మంత్రి అందజేశారు
- నాంపల్లిలో రూ.43.20 కోట్ల నిధులతో ఎల్‌ఐజీ ఫ్లాట్ల టవర్ నిర్మించనున్నారు



**హైదరాబాద్ :**

క్యూర్ పరిధిలోని 20 నియోజకవర్గాల్లో త్వరలోనే టెండర్లు పిలిచి ఇందిరమ్మ టవర్ల నిర్మాణం ప్రారంభిస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తోందన్నారు. నాంపల్లిలో 480 ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు భూమి పూజ చేసిన పొంగులేటి పేద ప్రజల జీవిత కల సాకారం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. క్యూర్ పరిధిలో 20 నియోజకవర్గాల్లో ఇప్పటికే భూములను గుర్తించాం. సుమారు 16 నుంచి 17 ప్రాంతాల్లో టెండర్లు పూర్తి చేశాం. రేపటి నుంచి ఇక్కడ పనులు కూడా కాంట్రాక్ట్?? చేయడానికి రెడీగా ఉన్నారు. సిటీకి గతంలో నివసించిన ప్రాంతానికి 30-40 కి.మీ దూరంలో అనాటి ప్రభుత్వం అరకొర ఇండ్లు నిర్మించిన మాట వాస్తవం. 40 కి.మీ దూరంలో ఈ పేదవారు అక్కడ నివసిస్తే, వారు అక్కడ జీవనోపాధి కోసం ఏ పని చేసుకుంటారో? లేదో? అని కూడా ఆనాటి పెద్దలకు ఆలోచన లేకపోవడం దురదృష్టకరం.నాంపల్లిలోని రెడ్‌హిల్స్‌లో 480 ఇందిరమ్మ ఇండ్లటవర్స్‌కు - మిగతా 2 లో

## నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా



- కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్
- కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం
- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు
- కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత
- రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు

**హైదరాబాద్ :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి - మిగతా 2 లో

## అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా



- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ
- నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో కొట్టిస్తానన్న కొండా సురేఖ
- వరంగల్‌లో ప్రతిపక్ష నేతలకు, పార్టీలోని కొందరికి హెచ్చరిక
- ప్రతిపక్ష నేతలు గాల్లో కత్తులు తిప్పుతున్నారంటూ వ్యాఖ్య
- కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పక్కనపెట్టాలని నేతలకు సూచన

**హైదరాబాద్ :**

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు.కొంతమంది నేతల తీరుపై - మిగతా 2 లో

# ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం

- రిలేలో విద్యా రామరాజ్ అద్భుత ప్రదర్శన
- ఏషియన్ గేమ్స్ మహిళల 4X400 మీటర్ల రిలేలో భారత్‌కు స్వర్ణం
- కిరణ్ పహల్, పూవమ్మ, ప్రాచి, విద్యా రామ్‌రాజ్‌ల బృందం అద్భుత ప్రదర్శన
- ఉత్కంఠభరితమైన చివరి ల్యాప్‌లో బహ్రెయిన్‌పై విజయం
- యాంకర్ లెగ్‌లో అద్భుతంగా పరుగెత్తి గెలిపించిన విద్యా రామ్‌రాజ్
- ఈ క్రీడల్లో విద్యాకు స్వర్ణం, రజతం, కాంస్యంతో కలిపి ఇది మూడో పతకం



**ఢిల్లీ :**

ఆసియా క్రీడల అథ్లెటిక్స్‌లో భారత మహిళల జట్టు స్వర్ణ పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన మహిళల 4ఇ400 మీటర్ల రిలే ఫైనల్లో భారత బృందం అద్భుతమైన ప్రదర్శనతో పసిడిని ముద్దాడింది. కిరణ్ పహల్, ఎం.ఆర్. పూవమ్మ, ప్రాచి, విద్యా - మిగతా 2 లో

## దేశవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు



- ఆరుగురు అరెస్ట్, కీలక పత్రాలు, ఫోన్లు స్వాధీనం
- ఆరుగురు అనుమానితులను అరెస్ట్ చేసినట్లు చెప్పిన జాతీయ దర్యాప్తు సంస్థ
- ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లతో సహా అనేక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడి

**ఢిల్లీ :**

అసోం, బంగాల్, కేరళ రాష్ట్రాల్లోని 16 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ మంగళవారం సోదాలు చేపట్టింది. 'జమాత్-ఉల్-ముజాహిదీన్ బంగ్లాదేశ్'కు అనుబంధంగా ఉన్న 'ఇమామ్ మహ్మదర్ కఫిలా'కు సంబంధించిన ఉగ్రవాద కుట్ర, అసోంలో యువతను తీవ్రవాద భావజాలం వైపు మళ్లింపుపై ఈ సోదాలు నిర్వహించింది. మొత్తం 16 ప్రాంతాల్లో 10 అసోంలో, 5 బంగాల్‌లో ఒకటి కేరళలో ఉన్నాయి. విచారణ కోసం అసోంలోని బార్పేట జిల్లాకు - మిగతా 2 లో

## భారత రైల్వేలో సరికొత్త ప్రయోగం పట్టాలెక్కిన తొలి ఎల్ఎన్‌జీ రైలు

- భారతదేశపు తొలి ఎల్ఎన్‌జీ ఆధారిత రైలు సేవలు ప్రారంభం
- అహ్మదాబాద్‌లో జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా
- డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌తో పనిచేయడం దీని ప్రత్యేకత
- డీజిల్‌తో పాటు ఎల్ఎన్‌జీ వాడకంతో 40శాతం ఇంధనం ఆదా అంచనా
- హైడ్రోజన్ రైలుకు భిన్నమైన టెక్నాలజీతో ఈ రైలు రూపకల్పన




**ఢిల్లీ :**

భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)తో నడిచే రైలును ప్రవేశపెట్టారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న సబర్మతి రైల్వే స్టేషన్‌లో ఈ నెల 27న కేంద్ర హోంమంత్రి అమిత్ - మిగతా 2 లో

## బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం

- మల్లేశ్‌కు సహకరించింది వారే..!
- మల్లేశ్‌కు గోడౌన్ కీపర్లు సహకరించినట్లు విచారణలో వెల్లడి
- వినోద్, శేషులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మల్లేశ్‌తో భారీ ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తింపు
- మల్లేశ్ ఇంట్లో ఆయుధాలు, బుల్లెట్ల స్వాధీనం
- సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం రెజిమెంట్‌కు మల్లేశ్ తరలింపు

2 లో..



## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

- ఇటీవల కన్నుమూసిన వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్
- ఒంగోలులో కాకుమాను నివాసానికి వెళ్లిన జగన్
- కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా

**అమరావతి :**

వైసీపీ అధినేత జగన్ ఈరోజు ఒంగోలులో పర్యటించారు. ఇటీవల మరణించిన పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఒంగోలులోని రాజశేఖర్ నివాసానికి వెళ్లిన జగన్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.కాగా, విజయవాడలో సెప్టెంబర్ 21న డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ - మిగతా 2 లో

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు



- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్
- గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి
- రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం
- అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపు

**అమరావతి :**

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, - మిగతా 2 లో

# గడ్డపార చేతబట్టి... డొంక రోడ్డుకు శ్రీకారం చుట్టి




- కొకులవారిపల్లి శ్రమదానం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- శ్రమదానంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్
- వీబీ జీ రాంజీ శ్రామికులతో కలసి పొలాల మధ్యకు డొంక రోడ్డుకు శ్రీకారం
- కాలినడకన పల్లెపండుగ అభివృద్ధి పనుల పరిశీలన
- పూల జల్లులతో స్వాగతించిన గ్రామస్తులు
- కొత్త రోడ్లపై గ్రామంలోకి నడిచి వెళ్లిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, శ్రీ మాధవ్
- గ్రామ సచివాలయం వద్ద వీబీ జీ రాంజీ శ్రామికులతో కలసి గ్రూప్ ఫొటో

**నెల్లూరు :**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ గడ్డపారలు చేత పట్టి వీబీ జీ రాంజీ పనులను ప్రారంభించారు. కొత్త డొంక రోడ్డుకు శ్రీకారం చుట్టారు. పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా కొకులవారిపల్లి గ్రామంలో పొలాల మధ్యకు నిర్మించతలపెట్టిన డొంక రోడ్డుకు శ్రమదానం చేశారు. గడ్డపారలతో ముగ్గురు నేతలు - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఓ నిశ్శబ్ద సంక్షోభం!



భారత్ భవిష్యత్‌లో ఎదుర్కొనే అతిపెద్ద సవాలు ఏమిటి? నిరుద్యోగం, కృత్రిమ మేధ, వాతావరణ మార్పు, నీటికొరత--ఇవన్నీ మాట్లాడుకుంటున్నాం. కానీ మరో సంక్షోభం గురించి చర్చ జరగడం లేదు-- అదే సంరక్షణ కొరత----కేర్ డెఫిసిట్. పిల్లలను చూసుకునేవారు, వృద్ధులకు తోడుగా ఉండేవారు తగ్గిపోతున్నారు. ఇప్పటివరకు ఈ బాధ్యతను మహిళలే మోశారు. కానీ ఉమ్మడి కుటుంబాలు కరిగిపోతున్నాయి, మహిళల ఉపాధి పెరుగుతోంది. సంరక్షణ అవసరం పెరుగుతుంటే, తీర్చాల్సిన కుటుంబాలు చిన్నవవుతున్నాయి. ఒక మహిళ తన పిల్లల కోసం ఉద్యోగం వదిలేస్తే, ఆమె నైపుణ్యం, ఆదాయం, స్వంత జీవితం-- అంతా ఆగిపోతుంది. ఈ నష్టం ఆమె కుటుంబానికి, పనిచేసే సంస్థకు, చివరికి దేశానికి కూడా చెందుతుంది.భారత టైమ్ యూజ్ సర్వే ప్రకారం, మహిళలు రోజుకు అయిదు గంటలు వేతనం లేని పని చేస్తారు. ఇది ఇంటి పని. పిల్లల, వృద్ధుల సంరక్షణ సమయం వేరే. ఈ పనిని ఎవరూ లెక్కవేయలేదు, ఎందుకంటే అది 'బాధ్యత' అనుకుంటారు. ఈ 'బాధ్యత' ఆర్థిక విలువ ఎంత? మహిళల ఉచిత గృహ, సంరక్షణ శ్రమ విలువ భారత జీడీపీలో 15 నుంచి 17శాతం-- అంటే రూ.34 లక్షల కోట్లకు పైగా ఉంటుందని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ అంచనా. మహిళా శ్రామికశక్తి భాగస్వామ్యంలో ఉన్న అంతరాన్ని పూడిస్తే 2025 నాటికి భారత జీడీపీకి సుమారు రూ.64 లక్షల కోట్లు జతకావొచ్చని మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా. సంరక్షణ భారం తగ్గితే, దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత పెరుగుతుందో ఈ రెండు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ప్రపంచ సంస్థలు కూడా ఇదే చెబుతున్నాయి. కేర్ సేవల్లో పెట్టుబడి పెడితే మహిళల ఉపాధి పెరుగుతుంది, ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. భారత ఆర్థిక సర్వే దీన్ని భారీ ఉపాధి రంగంగా పేర్కొంది; సుప్రీంకోర్టు కూడా సంరక్షణను దేశ నిర్మాణంలో కీలక భాగంగా చెప్పింది. ఈ సంక్షోభం భారత్‌కు మాత్రమే పరిమితం కాదు. అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఇదే సవాలును ఎదుర్కొంటున్నాయి. జర్మనీలో వృద్ధుల సంరక్షణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. ఆ వృద్ధుల పిల్లల వార్షిక ఆదాయం లక్ష యూరోలు దాటితేనే, వారి నుంచి కొంత ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం తీసుకుంటుంది.భారత్ కూడా తన మార్గాన్ని కనుగొనాల్సిన సమయం ఆసన్నమైంది. 2050 నాటికి భారత జనాభాలో దాదాపు 20శాతం మంది వృద్ధులు ఉంటారు. వారి సంరక్షణకు మూడు కోట్ల శిక్షణ పొందిన సిబ్బంది అవసరమని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అంచనా. రాబోయే దశాబ్దాల్లో భారత్ ఎంత పెద్ద సంరక్షణ మౌలిక వసతిని నిర్మించాల్సి ఉంటుందో ఈ సంఖ్యే చెబుతోంది. ప్రపంచంలోని అనేక దేశాలు కేర్ ఎకానమీని సంక్షేమ కార్యక్రమంగా కాకుండా ఉపాధి, మహిళల ఆర్థిక భాగస్వామ్యం, వృద్ధుల సంక్షేమం, ఆరోగ్య వ్యవస్థలను కలిపే అభివృద్ధి వ్యూహంగా చూస్తున్నాయి. భారత్ కూడా అదే దిశగా అడుగులు వేయాలి. రేపటి సంక్షోభం ఉద్యోగాలు లేకపోవడం వల్ల మాత్రమే కాదు, ఉద్యోగం చేయాలనుకున్న వారిని కాపాడుకునే వ్యవస్థ లేకపోవడం వల్ల కూడా రావొచ్చు. దీన్ని నివారించాలంటే, సంరక్షణను కుటుంబ వ్యక్తిగత బాధ్యతగా కాకుండా, విద్య, ఆరోగ్యం లాగే మౌలిక సదుపాయంగా మార్చాలి.

## గడ్డపార చేతబట్టి డొంక రోడ్డుకు శ్రీకారం చుట్టి

మొదటిపేజీ తరువాయి - మట్టిని తవ్వగా, ఆ గ్రామానికి చెందిన వీబీ జీ రాంజీ శ్రామికులు గంపలతో మట్టిని ఎత్తి రోడ్డు పోశారు. పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో డొంక రోడ్లకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. పైలట్ ప్రాజెక్టు కింద గ్రామీణ ప్రాంతాలు ఉన్న 167 నియోజకవర్గాల పరిధిలో నియోజక వర్గానికి ఒక్కటి చొప్పున డొంక రోడ్డు నిర్మించనుండగా, ఉదయగిరి నియోజకవర్గం పరిధిలో కొకులవారిపల్లి గ్రామంలో నిర్మించతలపెట్టిన డొంక రోడ్డు పనులను శ్రమదానం ద్వారా ముఖ్యమంత్రివర్యులు, ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. అంతకు ముందు కొకులవారిపల్లి గ్రామంలో పల్లెపండుగ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ముగ్గురు నేతలు కాలినడకన పరిశీలించారు. గ్రామ సరిహద్దుల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టె స్వాగతం పలుకగా, గ్రామంలోకి వేసిన బీటీ రోడ్డు, గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు, రోడ్డుకి సమీపంలో ఉన్న మినీ గోకులాన్ని పరిశీలించారు. రోడ్డు నాణ్యతను తనిఖీ చేశారు. సుమారు కిలోమీటరు మేర కాలినడకన కొకులవారిపల్లి గ్రామ సచివాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ వీబీ జీ రాంజీ శ్రామికులతో కలసి గ్రూప్ ఫొటో దిగారు.అంతకు ముందు తమ గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,పీవీఎన్ మాధవ్‌కు కొకులవారిపల్లి గ్రామానికి చెందిన మహిళలు గ్రామ సరిహద్దుల నుంచి పూల జల్లులతో స్వాగతం పలికారు. మహిళలతో ముచ్చటిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముగ్గురు నేతలు గ్రామంలోకి నడిచి వెళ్లారు.

### వేదికపై నడుస్తూ చేస్తూ.. ప్రజలకు అభివాదం

అంతకు ముందు పల్లెపండుగ 3.0 కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సభా వేదికపైకి విచ్చేసిన ముఖ్యమంత్రివర్యులు, ఉప ముఖ్యమంత్రివర్యులకు ప్రజలు అద్భుత స్వాగతం పలికారు. తమ మెడల్లోని కండువాలు గాల్లో ఊపుతూ, జయజయధ్వానాలు పలుకుతూ నేతలను స్వాగతించారు. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మాధవ్ గారు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. తమ అభిమాన నేతల్ని చూసి మహిళలు సైతం ఆనందంతో చిందులు వేశారు. ఫోన్లలో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. వేదికపై పల్లెపండుగ కార్యక్రమానికి పూర్వం గ్రామాల్లో పరిస్థితులు, పల్లెపండుగ తర్వాత అభివృద్ధిని వివరిస్తూ చేసిన వీడియో ప్రజెంటేషన్ సభికుల్ని ఆకట్టుకుంది.పవన్ కళ్యాణ్ గారిపై అభిమానం చాటుకున్న ఉదయగిరి ప్రజలుదపల్లెపండుగ 3.0కి తమ నియోజకవర్గాన్ని ఎంపిక చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్‌కళ్యాణ్ గారిపై ఉదయగిరి ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. జనసేన జెండా రంగులతో కూడిన గొడుగులతో వెల్కమ్ టూ పవన్ కళ్యాణ్ సర్ అంటూ.. ఆంగ్ల అక్షరమాలిక రూపాన నిలబడి కృతజ్ఞతలు తెలియజేశారు.

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు

మొదటిపేజీ తరువాయి - ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కళ్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కళ్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి" అని కోరారు.రైతుల కోసం డొంక రోడ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని, గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కళ్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు, విజయవంతం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## దేశవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు

మొదటిపేజీ తరువాయి - చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపింది. అరెస్టు అయిన వారి వద్ద నుంచి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లతో సహా అనేక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. IMK పన్నిన ఉగ్రవాద కుట్రకు సంబంధించి 11 మంది నిందితులపై వీన్ఐఏ అభియోగాలు నమోదు చేసిన మూడు నెలల తర్వాత సోదాలు నిర్వహించింది. అసోంలోని బార్‌పేట జిల్లాలో, ఆజాద్ నగర్ నిచుకా ప్రాంతాల్లోని పలు చోట్ల వీన్ఐఏ సోదాలు నిర్వహించింది. విచారణ కోసం అస్సాంలోని బార్పేట జిల్లాకు చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపింది. అరెస్టు అయిన వారిని సోర్భోగ్‌కు చెందిన ఫరూక్ అబ్దుల్లా, జాకీర్ హుస్సేన్, చాంద్‌బార్ అలీ, బార్పేట రోడ్‌కు చెందిన ముస్తఫిజుర్ రెహమాన్, నిషుకాకు చెందిన యాకూబ్ అలీ, హౌలీలోని జషిహతిపరా గ్రామానికి చెందిన రకీబుల్ ఇస్లాంలుగా గుర్తించారు. ఈ ఆపరేషన్ సమయంలో అనేక కీలకమైన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.మరోవైపు బంగాల్‌లోని దక్షిణ దినాజ్‌పుర్ జిల్లా కుష్మారి ముందేహర్ గ్రామానికి చెందిన ముజిబుర్ రెహమాన్ (26) ఇంటిపై 'జమాత్-ఉల్-ముజాహిదీన్' ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో దర్యాప్తు అధికారులు సోదాలు నిర్వహించారు. ముజిబుర్ ఇంటికి దూరంగా ఉండి చదువుకుంటుండగా, జనవరిలో పోలీసులు తమ ఇంటికి వచ్చి అతడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారని అతడి తండ్రి మిజానూర్ రెహమాన్ చెప్పారు. అప్పటి నుంచి ముజిబుర్ పరారీలో ఉన్నాడు. ప్రస్తుతం అతడి ఆచూకీ గానీ, కార్యకలాపాల గురించి గానీ ఎవరికీ తెలియదు. వీన్ఐఏ వర్గాల సమాచారం ప్రకారం, ముజిబుర్‌కు ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, నిందితుడి కుటుంబ సభ్యులు, స్థానికులు మాత్రం, అతడు తన ఉన్నత చదువులతో పాటు పరీక్షకు కూడా సన్నద్ధమవుతున్నాడని అంటున్నారు. గత జనవరి వరకు అతడు ఇంట్లోనే ఉన్నప్పటికీ, ఆ తర్వాత అతడి ఆచూకీ లేకుండా పోయింది. సుమారు ఏడు లేదా ఎనిమిది నెలల క్రితం పోలీసులు అతడి నివాసంలో సోదాలు నిర్వహించినట్లు స్థానిక వర్గాలు తెలిపాయి. బంగాల్, అసోం, త్రిపురతో సహా ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాద భావజాలాన్ని విస్తరించేందుకు IMK పన్నిన కుట్రలో నిందితులు చురుకుగా పాల్గొన్నట్లు వీన్ఐఏ దర్యాప్తులో తేలింది. ఈ కుట్రలో ఉగ్రవాద సంస్థ ఎజెండాను ప్రచారం చేయడం, భారతదేశంలో ఆ సంస్థ నెట్‌వర్క్‌ను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకు ంది. గువాహటిలోని వీన్ఐఏ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీ ట్‌లో నిందితులపై 'భారతీయ న్యాయ సంహిత- 2023', చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం- 1967'లోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.భారత్‌లో నిషేధిత సంస్థ జీడీవీ దుర్మార్గపు ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి, ఆ సంస్థకు చెందిన సీనియర్ సభ్యుడు ఇమామ్ మహమూద్ హబీబుల్లా 'IMK'ని స్థాపించినట్లు వీన్ఐఏ దర్యాప్తులో తేలింది. రహస్య సమావేశాలు, మతపరమైన భావజాల ప్రచారం, తీవ్రవాద సాహిత్యాన్ని పంపిణీ, నాయకత్వానికి మద్దతుగా భారత్‌కు వ్యతిరేకంగా డిజిటల్ వేదికల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ మార్గాల ద్వారా భారతదేశంలో ఉనికిని విస్తరించడానికి ఈ 11 మంది నిందితులు కుట్ర పన్నినట్లు వీన్ఐఏ అధికారులు గుర్తించారు.

## నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా

మొదటిపేజీ తరువాయి - పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు.నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు.ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు.గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

## క్యూర్ పరిధిలో మరో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన

మొదటిపేజీ తరువాయి - గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రులు లబ్ధిదారులకు ఫ్లాట్లు కేటాయింపు పత్రాలు అందజేశారు. గత ప్రభుత్వం మాదిరి నగరానికి దూరంగా కాకుండా వందల కోట్ల రూపాయలు విలువ చేసే ప్రముఖ ప్రాంతాల్లో అద్భుతమైన టవర్లు నిర్మించి పేదలకు ఇస్తున్నామని పొంగులేటి చెప్పారు.గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో ఇళ్లు నిర్మించామని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఈ మొదటి విడతలోనే ఆ ప్రభుత్వం కట్టిన దానికంటే రెట్టింపు ఇండ్లను నిర్మించి చూపిస్తాను. మొదటి విడతలోనే నేను కట్టి చూపిస్తే మరి నువ్వు రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వస్తావా? లేకుంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉంటావా అని అడగగా దానికి కేటీఆర్ దగ్గర సమాధానం లేదు. పదేళ్లలో నిజంగానే ఇండ్లు నిర్మించి ఉంటే ఈనాడు రాష్ట్రంలో హైదరాబాద్? పట్టణంలో నాంపల్లి నియోజకవర్గంలో పేదవారి ఇళ్ల కళ ఇలా ఉండేది కాదు.పేద ప్రజల జీవిత కళ సాకారం చేసేందుకు, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమం చేపట్టామని పొంగులేటి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఉచితంగా చేస్తామని మంత్రులు తెలిపారు. భవిష్యత్తులో వాటిపై పిల్లల చదువులు, పెళ్లిళ్ల అవసరాలకు లోన్లు కూడా తీసుకోవచ్చని సూచించారు.

## అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా

మొదటిపేజీ తరువాయి - కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

## బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం



మొదటిపేజీ తరువాయి - బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసు దర్యాప్తులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ హవల్దార్ మల్లేశ్‌కు ఆయుధాగారం ఇన్‌చార్జ్‌లు సహకరించినట్లు విచారణలో తేలింది. దీంతో వెపన్స్ గోడౌన్ కీపర్లు వినోద్, శేషులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వినోద్, శేషులు ఆయుధాల చోరీలో మల్లేశ్‌కు సహకరించినట్లు పోలీసులు ఆధారాలు గుర్తించారు. మల్లేశ్‌తో వారికి భారీగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సాంకేతిక ఆధారాల ద్వారా నిర్ధారణకు వచ్చారు. దీంతో ఈ కేసు దర్యాప్తును పోలీసులు మరింత వేగవంతం చేశారు.మల్లేశ్ నివాసంలో ఇప్పటికే పోలీసులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు కీలకమైన ఆర్మీ ఆయుధాలు, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం మల్లేశ్‌ను 10 రోజుల పోలీసు కస్టడీలో విచారిస్తున్నారు.దర్యాప్తులో భాగంగా సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం మల్లేశ్‌ను నేరుగా మద్రాస్ రెజిమెంట్‌కు తీసుకెళ్లారు. ఈ కేసులో మరిన్ని వివరాలను పోలీసులు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

మొదటిపేజీ తరువాయి - వైసీపీ చేపట్టిన నిరసనలో జరిగిన తోపులాట అనంతరం రాజశేఖర్ అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. రాజశేఖర్ గతంలో లిడ్‌క్యాప్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం

మొదటిపేజీ తరువాయి - రామ్‌రాజ్‌లతో కూడిన భారత జట్టు 3 నిమిషాల 29.69 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని అగ్రస్థానంలో నిలిచింది. ఈ విజయంతో గత ఆసియా క్రీడల్లో సాధించిన రజతాన్ని భారత్ స్వర్ణంగా మార్చుకుంది.రేసు ఆరంభం నుంచి భారత్ పతకం కోసం తీవ్రంగా పోటీపడింది. తొలి ల్యాప్‌లో పరుగెత్తిన కిరణ్ పహల్ మూడో స్థానంలో బ్యాటన్‌ను అందించగా, రెండో ల్యాప్‌లో అనుభవజ్ఞురాలైన పూవమ్మ వేగాన్ని పెంచి భారత్‌ను పోటీలో ముందుకు తెచ్చింది. ఇప్పటికే వ్యక్తిగత 400 మీటర్ల విభాగంలో కాంస్యం గెలుచుకున్న ప్రాచి, మూడో ల్యాప్‌లో అదే ఊపును కొనసాగించి పతకాన్ని ఖాయం చేసే స్థితిలో నిలిపింది.ఇక చివరిదైన యాంకర్ లెగ్‌లో విద్యా రామ్‌రాజ్ తన సత్తా చాటింది. బహ్రెయిన్ అథ్లెట్ సల్వా ఈద్ నాసర్ నుంచి తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ, విద్యా ఏమాత్రం ఒత్తిడికి లోనుకాలేదు. చివరి 200 మీటర్లలో తనదైన శైలిలో స్ప్రింట్ చేసి, ఆధిక్యాన్ని కాపాడుకుంటూ విజయ రేఖను దాటింది. దీంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ పోరులో బహ్రెయిన్ 3:30.21 సెకన్లతో రజతం, చైనా 3:31.02 సెకన్లతో కాంస్యం గెలుచుకున్నాయి.ఈ ఆసియా క్రీడల్లో విద్యా రామ్‌రాజ్‌కు ఇది మూడో పతకం కావడం విశేషం. ఇప్పటికే 400 మీటర్ల హర్డిల్స్‌లో రజతం, మిక్స్‌డ్ రిలేలో కాంస్యం గెలుచుకున్న ఆమె, తాజాగా రిలే జట్టుకు స్వర్ణం అందించడంలో కీలక పాత్ర పోషించి బంగారు ముగింపు పలికింది. కొన్ని దశాబ్దాల నాటి జాతీయ రికార్డును బద్దలు కొట్టిన మరుసటి రోజే ఆమె ఈ ఘనత సాధించడం గమనార్హం. 4ఇ400 మీటర్ల రిలేలో బలమైన చరిత్ర ఉన్న భారత్, ఈ విజయంతో మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

## భారత రైల్వేలో సరికొత్త ప్రయోగం పట్టాలెక్కిన తొలి ఎల్ఎన్‌జీ రైలు




మొదటిపేజీ తరువాయి - షా ఈ రైలును జెండా ఊపి ప్రారంభించారు. సబర్మతి నుంచి మెహసానా మధ్య ఈ రైలు తన తొలి ప్రయాణాన్ని పూర్తిచేసుకుంది.ఈ రైలు ఎనిమిది కోచ్‌లు కలిగిన డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (డీఈఎంయూ) ర్యాక్. దీని ప్రత్యేకత డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌తో పనిచేయడం. ఈ రైలుకు ఉన్న రెండు 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల డ్రైవింగ్ పవర్ కార్లను (ఇంజిన్లు) డీజిల్‌తో పాటు ఎల్ఎన్‌జీతో కూడా నడిచేలా మార్పులు చేశారు. ఇంధన లభ్యత, అవసరాన్ని బట్టి డీజిల్ లేదా ఎల్ఎన్‌జీల మధ్య ఇంజిన్‌ను మార్చుకునే సౌలభ్యం దీనిలో ఉంది. ప్రతి పవర్ కారులో 2,200 లీటర్ల సామర్థ్యమున్న ప్రత్యేక ఇన్సులేటెడ్ ఎల్ఎన్‌జీ ట్యాంక్‌ను అమర్చారు. ఇది అత్యంత శీతల ఉష్ణోగ్రతల్లో ఇంధనాన్ని సురక్షితంగా నిల్వ చేస్తుంది.ఈ డ్యూయల్ ఫ్యూయల్ విధానం ద్వారా డీజిల్ వాడకాన్ని దాదాపు 40 శాతం వరకు తగ్గించవచ్చని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రయల్ రన్స్‌లో వెల్లడైన వివరాల ప్రకారం, ఒక్కో డ్రైవింగ్ పవర్ కారుకు ఏటా సుమారు రూ.11.9 లక్షల వరకు ఇంధన ఖర్చు ఆదా అయ్యే అవకాశం ఉంది. ఈ రైలును అధికారికంగా ప్రారంభించడానికి ముందు 2,000 కిలోమీటర్లకు పైగా క్షేత్రస్థాయిలో విజయవంతంగా పరీక్షించారు.అయితే, ఎల్ఎన్‌జీ కూడా శిలాజ ఇంధనమే కావడంతో ఇది పూర్తిస్థాయిలో కాలుష్యరహిత రైలు కాదు. కానీ, విద్యుదీకరణ పూర్తికాని మార్గాల్లో డీజిల్ వాడకాన్ని, నిర్వహణ ఖర్చులను తగ్గించడం, కర్బన ఉద్గారాలు, నైట్రోజన్ ఆక్సైడ్‌ల విడుదలను నియంత్రించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇటీవల ప్రవేశపెట్టిన హైడ్రోజన్ రైలుకు, ఈ ఎల్ఎన్‌జీ రైలుకు సాంకేతికంగా కీలకమైన వ్యత్యాసం ఉంది. హైడ్రోజన్ రైలులో ఫ్యూయల్ సెల్స్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నడిపిస్తే, ఈ ఎల్ఎన్‌జీ రైలులో మాత్రం సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌నే డ్యూయల్ ఫ్యూయల్ కోసం మార్పులు చేసి వినియోగిస్తున్నారు.

## మహిళా ఎమ్మెల్యేలతో దురుసు ప్రవర్తన

**ఆ పోలీసులను గుర్తించాలన్న తెలంగాణ హైకోర్టు**

**దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని డీజీపీకి హైకోర్టు ఆదేశం**

**సంబంధిత పోలీసుల వివరాలను స్పీకర్‌కు సమర్పించాలని సూచన**

**వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉందని వ్యాఖ్యానించిన కోర్టు**

**సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ**



తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది.సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.

## బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా లక్ష్మణ్

**వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వకీల్ సాబ్ (బత్తుల బాబురావు)**



**మాచర్ల ప్రతినిధి ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 :** బీసీ సంక్షేమ సంఘం మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా భీమవరపు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బత్తుల బాబురావు (వకీల్ సాబ్), పల్నాడు జిల్లా కార్యదర్శిగా భీమవరపు శ్రీనివాసరావు,పట్టణ మహిళా అధ్యక్షురాలిగా పగడాల విజయలక్ష్మీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మాచర్ల రైల్వే స్టేషన్ రోడ్డులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జింకల నాగేశ్వరరావు పదవులను ప్రతిపాదించగా, రాష్ట్ర కార్యదర్శి బృంగారమణారావు బలపరిచారు. అనంతరం పల్నాడు జిల్లా అధ్యక్షులు బిళ్లకంటి శ్రీనివాసరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు నియామకాలను ఆమోదించారు. ఈ సందర్భంగా నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల బాబురావు (వకీల్ సాబ్) మాట్లాడుతూ బీసీల హక్కుల పరిరక్షణకు సంఘం సభ్యులు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీసీ చట్టం సాధనతో పాటు ఎన్నికల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించేలా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పలువురు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు కదం నాగజ్యోతి, జిల్లా అధికార ప్రతినిధి బాదంబాయ్, మాచర్ల మండల అధ్యక్షులు వెంకట్రామయ్య, పట్టణ అధ్యక్షులు పోతులూరి పిచ్చయ్య, గోలి శ్రీనివాసరావు, శ్యామసుందరాచారి తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న సేవల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ప్రత్యేక పూజలు...



**ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 :అమీన్ పూర్.** అమీన్‌పూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రంతో పాటు ప్రసిద్ధ కొమురవెల్లి మల్లన్న స్వామి దేవాలయాలను మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటగా వర్గల్ క్షేత్రానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అక్కడ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించారు. విద్యార్థులకు చక్కటి విద్య, విజ్ఞానం లభించాలని, భావితరాలు ఉన్నత స్థాయికి ఎదగాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ దర్శన కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు తలారి రాములు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు.



## రాజుపాలెం జడ్పీ హైస్కూల్ నూతన విద్యా కమిటీ చైర్మన్‌గా గుండారి గంగారావు



**ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 : రాజుపాలెం మండల ప్రతినిధి ।** రాజుపాలెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రాజుపాలెం గ్రామానికి చెందిన గుండారి గంగారావును కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అలాగే పోలిశెట్టి సునీతను వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అనంతరం నిర్వహించిన సమావేశంలో నూతన చైర్మన్ గుండారి గంగారావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో ముందుకు సాగుతానన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

## కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి సీడీపీవో లక్ష్మీ భవాని



**కంచికచర్ల ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 :** కంచికచర్ల కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల సీడీపీవో జె. లక్ష్మీ భవాని పిలుపునిచ్చారు. వింధన్ వాత్సల్య, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన ( పి ఎం ఎం వి వై ) వంటి పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన 9వ జాతీయ పోషణ మాసం మరియు అంగన్వాడీ ఉత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్స్, గోద్ భరాయ్, బేటీ బచావో బేటీ పడావో వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అనంతరం బీజేపీ వైస్ ప్రెసిడెంట్ విజయబాబు అలియాస్ కళ్యాణ్ బాబు మాట్లాడుతూ కేంద్ర పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబనసాధించాలన్నారు. బీజేపీ మహిళా వైస్ ప్రెసిడెంట్ ఎన్టీఆర్ జిల్లా ఇన్-చార్జి రమాదేవి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శారద, తవకల్ గండేపల్లి అంగన్వాడీ టీచర్స్ బొక్కా రోజా, ఐలపోగు సౌజన్య, మార్కపుడి సరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సౌకర్యాల కోసం 40 మంచాల అందజేతదాతల సహకారం మరువలేనిది



**నందిగామ ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 :** నందిగామ పట్టణం అశోక్‌నగర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థుల సౌకర్యార్థం దాతల సహకారంతో సమకూర్చిన 40 మంచాలను కూటమి నేతలు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య విద్యార్థులకు అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో దాతలు అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని, వారి సేవలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు అందుబాటులోకి వచ్చిన ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాలను సాధించి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే సౌమ్య గారు ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు అధికారులు విద్యార్థులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# పైల్ నేమ్ న్యూటన్స్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

**లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో**

**214 మంది విద్యార్థుల రక్తదానం**

**తలసీమియా బాధితులకు అండగా నిలిచిన యువత**

**లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి**






**మాచర్ల ప్రతినిధి ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 :** అలుగురాజుపల్లి గ్రామంలోని న్యూటన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల, గుంటూరుకు చెందిన తలసీమియా నీడ్స్ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తలసీమియా బాధితుల కోసం నిర్వహించిన ఈ శిబిరంలో కళాశాలకు చెందిన 214 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ పాస్ట్ జిల్లా గవర్నర్ లయన్ ఎన్. గోపీచంద్ పర్చూరి మాట్లాడుతూ రక్తదానాన్ని కేవలం దాతృత్వంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ఒక బొట్టు రక్తం ఒక ప్రాణాన్ని కాపాడగలదని, తలసీమియాను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి విద్యార్థులను రక్తదానం వైపు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. లయన్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ యువత రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని, ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా క్రమం తప్పకుండా రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి సహాయం చేయవచ్చన్నారు. యువతలో సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. లయన్ డాక్టర్ రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుంటూరుకు చెందిన తలసీమియా నీడ్స్ బ్లడ్ సెంటర్ సిబ్బంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు నిర్వాహకులు పండ్లు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం లయన్ ఎన్. గోపీచంద్, లయన్ వెంకట సుబ్బయ్య, కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, నిర్వాహకులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో న్యూటన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అకడమిక్ డైరెక్టర్ జున్నా చక్రధర్‌రెడ్డి, డాక్టర్ గుర్రం రాజశేఖరరెడ్డి, మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చారి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ బి. నరసింహారావు, ఏవో ఖాసిం, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.లయన్స్ క్లబ్ సభ్యులు ఎం.వి. పుల్లారావు, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ విష్ణు, డాక్టర్ హరీష్, కె. నాగేశ్వరరావు, పాశం శ్రీనివాసరెడ్డి, వి. సాంబశివరావు, బచ్చు సుబ్బారావు, పంతంగి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య సేవా లో రాందేవ్ హాస్పిటల్ ముందంజ

**ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వాక్ దాన్..**



**కూకట్పల్లి ప్రతినిధి, ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 :** ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వాకథాన్, ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం ్న సేవలు పొందిన 406 మంది ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకథాన్, ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం నిర్వహించారు. హృదయ సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం, ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యాన్ని తెలియజేయడం ఈ కార్యక్రమాల లక్ష్యమని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ కార్యక్రమంలో భాగంగా, కుముదినీదేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ సనాతన సహకారంతో వాకథాన్ నిర్వహించారు. ప్రముఖ రేకీ థెరపీ గ్రాండ్ మాస్టర్, రచయిత్రి, ఫ్యామిలీ కౌన్సిలర్ మరియు సామాజిక కార్యకర్త లక్ష్మీ కమలాకర్ పచ్చజెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించారు. నిత్యం వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా హృదయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. వాకథాన్‌లో గైనకాలజిస్టులు డా. చాయాదేవి, డా. ప్రమోదిని, డా. మంజుల, డా. సుమన్ లత; కార్డియాలజిస్టులు డా. ప్రదీప్ రెడ్డి, డా. శ్రీకాంత్; రేడియాలజిస్టులు డా. లోకేష్ రెడ్డి, డా. మౌనిక; ఈఆర్ ఫిజీషియన్లు డా. స్వాతి రెడ్డి, డా. సుమ, డా. వీరభద్ర; పాథాలజిస్టులు డా. పావని, డా. చందన పాల్గొన్నారు. వీరితో పాటు డా. సుధారాణి (అనస్థీషియా), డా. డి. నాగేంద్ర (పల్మనాలజిస్ట్), డా. రోహిత్ నాయక్ (న్యూరో సర్జన్), డ్యూటీ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు మరియు ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. వాకథాన్ అనంతరం వైద్యులు గుండె జబ్బుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, రక్తపోటు మరియు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు. రామ్‌దేవ్‌రావు హాస్పిటల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరంలో బీపీ, జీఆర్‌బీఎస్ (రక్తంలో చక్కెర), ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలతో పాటు కార్డియాలజీ వైద్యుల సంప్రదింపులను అందించారు. శిబిరానికి విశేష స్పందన లభించగా, మొత్తం 406 మంది ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకత్వంలో, డా. కమలాకర్, డా. ప్రదీప్ రెడ్డి మరియు డా. యోబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. సహకరించిన వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు, పాల్గొన్న ప్రజలందరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. "ప్రజల ఆరోగ్యం -- మా బాధ్యత" అనే స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటామని, భవిష్యత్తులోనూ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు మరియు ఉచిత వైద్య శిబిరాలను కొనసాగిస్తామని హాస్పిటల్ యాజమాన్యం పేర్కొంది.



# బిఆర్ఎస్ ను గండి కొడుతున్న టిఆర్ఎస్ కవిత...

**కవిత వర్సెస్ కేటీఆర్..**



**ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 : శేరిలింగంపల్లి ప్రతినిధి:** తెలంగాణ రాజకీయాలలో సరికొత్త ప్రాంతీయ శక్తిగా ఎదగాలనే లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించిన కల్వకుంట్ల కవిత.. ఇప్పుడు తన రాజకీయ వ్యూహాలకు మరింత పదును పెట్టారు. కేవలం కాంగ్రెస్, బీజేపీలపైనే కాకుండా, ప్రధానంగా బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును పొలిటికల్ గా కార్నర్ చేసే ఒక భారీ సర్జికల్ స్ట్రైక్ కు ఆమె తెరలేపినట్లు క్షేత్రస్థాయి పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో హరీష్ రావు చేసిన వివిధ భూ లావాదేవీలు, ఆర్థిక అక్రమాలను టార్గెట్ చేసి, వాటి చిట్టాను ప్రజల ముందుకు తెచ్చేలా కవిత పక్కా స్కెచ్ వేసినట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా టాక్ నడుస్తోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో కవిత చేసిన వ్యాఖ్యలు ఈ విశ్లేషణకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. హరీష్ రావు భూ లావాదేవీలపై విచారణ జరిపించే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి ఉందా..? అంటూ ఆమె నేరుగానే సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డి సమస్యల్లో ఉంటే.. హరీష్ రావు వెనుక ఉండి సపోర్ట్ చేస్తాడు" అంటూ వీరిద్దరి మధ్య ఉన్న తెరవెనుక సత్సంబంధాలను ఆమె ఎండగట్టారు. అంతేకాకుండా, గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల సమస్యలను వదిలేసి వ్యక్తిగత దూషణలకు దిగారంటూ బీఆర్ఎస్ లీడర్‌షిప్‌ను కడిగిపారేశారు. "నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి.. నాతో పెట్టుకోవద్దు, సమయం వచ్చినప్పుడు అన్నింటినీ బయటపెడతా" అంటూ హరీష్ రావు అక్రమాలను టార్గెట్ చేస్తూ ఆమె ఇచ్చిన హింట్స్ ఇప్పుడు గులాబీ గూటిలో పెద్ద అలజడి రేపుతున్నాయి. మరోవైపు, ఖైరతాబాద్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో తన తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిని బరిలోకి దింపుతున్నట్లు కవిత ప్రకటించడం ఈ పొలిటికల్ వేటకు మరింత మైలేజ్ తెచ్చిపెట్టింది. ఒకవైపు క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని చాటుకుంటూనే.. మరోవైపు హరీష్ రావు గత పాలనలోని అక్రమాలను, వైఫల్యాలను బహిరంగంగా ఎండగట్టడం ద్వారా బీఆర్ఎస్ సాంప్రదాయ ఓటు బ్యాంక్‌ను, ముఖ్యంగా యువత, మహిళా ఓటర్లను తన వైపు తిప్పుకోవాలని కవిత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. సొంత పార్టీ పెట్టిన తర్వాత కవిత ఏమాత్రం తగ్గకుండా.. హరీష్ రావు సమాంతర రాజకీయాలను, అక్రమాలను టార్గెట్ చేస్తూ వేట మొదలుపెట్టడం బీఆర్ఎస్ శ్రేణులను తీవ్ర ఆత్మరక్షణలోకి నెట్టింది. మరి కవిత విసురుతున్న ఈ రాజకీయ అస్త్రాలను తట్టుకుని హరీష్ రావు తన ఉనికిని ఎలా కాపాడుకుంటారు..? ఈ ఇద్దరి మధ్య నడుస్తున్న అంతర్గత అక్రమాల పోరు రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలను ఎటు వైపు తిప్పుతుందనేది అత్యంత ఆసక్తికరంగా మారింది.




# మాచర్లలో మండవ ఎంపీఎల్ క్రికెట్ పోటీలు

**యువ క్రీడాకారులకు ప్రోత్సాహమే లక్ష్యం: మండవ రవి**



**మాచర్ల, ప్రతినిధి ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 :** పల్నాడు ప్రాంతంలోని యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి, ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మండవ ఎంఎల్‌పీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 30 నుంచి పోటీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మండవ ఎంఎల్‌పీఎల్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని చైర్మన్ మండవ రవి తెలిపారు. క్రీడాకారుల ఎంపిక కోసం నాలుగు నెలలుగా సహచరులతో కలిసి కృషి చేసి మొత్తం ఎనిమిది జట్లను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఒక్కో జట్టులో 20 మంది క్రీడాకారులు ఉండేలా జట్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మాచర్ల నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను రాష్ట్ర, జాతీయ స్థాయిలో చాటాలని ఆకాంక్షించారు. మండవ ఎంఎల్‌పీఎల్ నిర్వహణకు సుమారు రూ.42 లక్షల వరకు ఖర్చు అవుతుందని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆ వ్యయాన్ని భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మండవ రవి తెలిపారు. ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు సరైన వేదిక కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. మండవ రవి తిరిగి సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి రావడం పట్ల మాచర్ల పరిసర ప్రాంతాల ప్రజలు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గతంలో కూడా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఆయనకు యువతలో మంచి ఆదరణ ఉందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు గాడిపర్తి శ్రీనివాసరావు, ఎం.ఎస్. నాగేశ్వరరావు, రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో మండవ రవి ఆధ్వర్యంలో సుమారు రూ.3 కోట్ల విలువైన సేవా కార్యక్రమాలు జరిగినట్లు తెలిపారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎంఎల్‌పీఎల్ కార్యక్రమం యువతకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు డాక్టర్ కే.పీ. చారి, అన్వర్, చిన్ని, సీత అంజి, వెంకటరెడ్డి, సాంబశివరావు, వాసు, పాటిబండ్ల చెన్నకేశవ, షేక్ ఖాసిం, నజీర్ మాస్టర్, నారాయణ, వేణుగోపాల్, ఇమామ్, ప్రవీణ్, కిరణ్, నవీన్‌తో పాటు మీడియా ప్రతినిధులు, జట్టు యజమానులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

## పిత్ర పక్షం 15 రోజులు.. చంటి పిల్లలు ఉన్న కుటుంబాలు పాటించాల్సిన జాగ్రత్తలివే..

**ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 : శేరిలింగంపల్లి ప్రతినిధి:** ఇంట్లో చంటి పిల్లలు ఉన్నప్పుడు ఈ సంప్రదాయ జాగ్రత్తలకు మరింత ప్రాధాన్యత ఇస్తారు. ముఖ్యంగా రాత్రివేళల్లో పిల్లలను అవసరం లేకుండా బయటకు తీసుకెళ్లకపోవడం, నిర్మానుష్య ప్రాంతాలు లేదా తెలియని ప్రదేశాలకు తీసుకెళ్లకుండా ఉండటం, పూజా కార్యక్రమాల సమయంలో పిల్లలను ప్రశాంతమైన వాతావరణంలో ఉంచడం వంటి వాటిని పాటిస్తారు. అలాగే నల్ల దుస్తులు, అధిక హడావుడి, అశుభకరంగా భావించే కార్యక్రమాలకు దూరంగా ఉండటం వంటి కుటుంబ ఆచారాలు కూడా కొన్ని చోట్ల ఉన్నాయి. రాత్రివేళ చంటి పిల్లలను బయటకు తీసుకెళ్లకపోవడం.పిత్ర పక్షం సమయంలో పూర్వీకుల ఆత్మలు భూమికి సమీపంగా ఉంటాయని నమ్మకం. ఈ కారణంగా చిన్న పిల్లలను రాత్రివేళల్లో అవసరం లేకుండా బయటకు తిప్పకుండా ఇంట్లోనే ఉంచడం మంచిదని కొన్ని కుటుంబాల్లో ఆచారం. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా తిరగడం, తెలియని ప్రదేశాల్లో ఎక్కువసేపు ఉండటం వంటివాటికి దూరంగా ఉంటారు. ఇది ప్రధానంగా సంప్రదాయ విశ్వాసం. నిర్మానుష్య ప్రాంతాలకు పిల్లలతో విహారయాత్రలు వద్దు.పిత్ర పక్షం రోజుల్లో చంటి పిల్లలను తీసుకుని నిర్మానుష్యమైన కొండలు, అడవులు, శ్మశాన వాటికలకు సమీప ప్రాంతాలు లేదా నసంచారం చాలా తక్కువగా ఉండే ప్రదేశాలకు వెళ్లకపోవడం మంచిదని కొన్ని ప్రాంతీయ విశ్వాసాలు చెబుతాయి. ప్రత్యేకంగా సాయంత్రం తర్వాత ఇలాంటి ప్రదేశాలకు వెళ్లకుండా ఉండటం సంప్రదాయపరంగా జాగ్రత్తగా భావిస్తారు. సాయంత్రం తర్వాత అనవసర ప్రయాణాలు తగ్గించండి. అత్యవసరమైన ప్రయాణాలకు ఎలాంటి ఆచారం అడ్డంకి కాదు. కానీ కేవలం వినోదం కోసం రాత్రివేళల్లో దూర ప్రయాణాలు చేయడం, బిడ్డతో ఆలస్యంగా ఇంటికి రావడం వంటి వాటిని ఈ కాలంలో తగ్గించడం కుటుంబ సంప్రదాయాల్లో కనిపిస్తుంది. పిత్ర పక్షం ప్రధాన ఉద్దేశం పూర్వీకులను స్మరించుకోవడం కాబట్టి ఇంటి వద్ద ప్రశాంతంగా ఉండటానికి ప్రాధాన్యత ఇస్తారు.చంటి పిల్లలకు నల్ల దుస్తులు వేయకుండా ఉండటం. కొన్ని పిత్రకర్మ సంప్రదాయాల్లో నల్ల లేదా ముదురు రంగు దుస్తులను పూజా సందర్భాల్లో నివారించాలని చెబుతారు.పిత్ర తర్పణ సమయంలో నల్ల దుస్తులకు బదులుగా తెలుపు వంటి సాధారణ రంగులను ధరించే ఆచారాలు కూడా ఉన్నాయి. అయితే ఇది ప్రతి కుటుంబంలో తప్పనిసరి నియమం కాదు. చంటి పిల్లలకు సౌకర్యవంతంగా ఉండే శుభ్రమైన దుస్తులనే



వేయడం ముఖ్యం.శ్మశాన వాటికల దగ్గరికి పిల్లలను తీసుకెళ్లకండి.పిత్ర పక్షం పూర్వీకుల స్మరణకు సంబంధించిన కాలం అయినప్పటికీ, చంటి పిల్లలను శ్మశాన వాటికలు లేదా అంత్యక్రియలకు సంబంధించిన ప్రదేశాలకు అనవసరంగా తీసుకెళ్లకుండా ఉండే సంప్రదాయం ఉంది. ప్రత్యేకంగా రాత్రివేళల్లో ఇలాంటి ప్రదేశాలకు పిల్లలను తీసుకెళ్లకుండా ఉండటం మంచిదని పెద్దలు సూచిస్తారు. సాయంత్రం తర్వాత చెట్లు, చెరువులు, కాలువల దగ్గర తిరగకండి.గ్రామీణ ప్రాంతాల్లో సాయంత్రం తర్వాత పెద్ద చెట్లు, చెరువులు, కాలువలు లేదా జనసంచారం తక్కువగా ఉండే ప్రదేశాల వద్దకు పిల్లలను తీసుకెళ్లకపోవడం వంటి ఆచారాలు ఉన్నాయి.ఇందులో ఆధ్యాత్మిక విశ్వాసంతో పాటు చిన్న పిల్లల భద్రతను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు. రాత్రివేళల్లో అనవసరంగా ఇల్లు మార్చడం లేదా దూర ప్రయాణం వద్దు. పిత్ర పక్షంలో ఇంట్లో ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలని సంప్రదాయంగా భావిస్తారు. అందువల్ల చంటి పిల్లలతో రాత్రివేళల్లో ఒకచోటు నుంచి



మరోచోటికి తరచుగా ప్రయాణించడం, అవసరం లేని దూర ప్రయాణాలు చేయడం తగ్గిస్తారు. అత్యవసరమైన ప్రయాణం అయితే మాత్రం ఆపాల్సిన అవసరం లేదు. ఇంట్లో అధిక శబ్దం, గొడవలు లేకుండా చూసుకోండి. పిత్ర పక్షం సమయంలో కోపం, గొడవలు, కుటుంబ కలహాలకు దూరంగా ఉండాలని సంప్రదాయాలు సూచిస్తాయి. చంటి పిల్లలు ఉన్న ఇంట్లో ఇది మరింత ఉపయోగకరం. ప్రశాంతమైన వాతావరణం ఉంటే బిడ్డ నిద్ర, సాధారణ దినచర్య కూడా సక్రమంగా ఉంటుంది. ఇంట్లో ధూపం, కర్పూరం ఎక్కువగా వేయకండి. పిత్ర పూజలు, తర్పణం సమయంలో ధూపం, దీపం వంటి వాటిని ఉపయోగించే కుటుంబాలు ఉంటాయి. అయితే పసిబిడ్డ ఉన్న గదిలో పొగ ఎక్కువగా పేరుకుపోకుండా జాగ్రత్త పడాలి. పిల్లలను పూజా స్థలానికి చాలా దగ్గరగా ఉంచకుండా, గాలి ప్రసరణ ఉండేలా చూసుకోవడం మంచిది.పిత్ర పక్షంలో అర్ధరాత్రి వరకు వేడుకలు వద్దు.

## నిమ్స్ అధికారిపై అక్రమాస్తుల ఆరోపణలు..

### కట్‌చేస్తే.. బార్బర్ ఇంట్లో రూ.7 లక్షల నగదు సీజ్




**ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 : శేరిలింగంపల్లి ప్రతినిధి:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిమ్స్ అదనపు సూపరింటెండెంట్ లక్ష్మీ భాస్కర్‌కు సంబంధించిన వ్యవహారాలపై ఏసీబీ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఆయన అక్రమంగా సంపాదించిన ఆస్తులను ఇతరుల పేర్లపై పెట్టుబడులుగా మళ్లించారన్న సమాచారంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. లక్ష్మీభాస్కర్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులతో పాటు నిమ్స్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల ఇళ్లలోనూ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు కీలక పత్రాలు, హార్డ్‌డిస్క్‌లు, డైరీలు, బ్యాంకు లాకర్లకు సంబంధించిన తాళాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాల్లో భాగంగా నిమ్స్‌లో బార్బర్‌గా పనిచేస్తున్న ధనరాజు ఇంట్లో లెక్కల్లో చూపని రూ.7 లక్షల నగదు బయటపడటం చర్చనీయాంశంగా మారింది. ఈ నగదుకు లక్ష్మీభాస్కర్‌తో ఏమైనా సంబంధం ఉందా, ధనరాజు పేరును బినామీగా ఉపయోగించి ఆర్థిక లావాదేవీలు నిర్వహించారా అనే కోణాల్లో ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నారు. కాంట్రాక్టుల కేటాయింపులు, ఔషధాల సరఫరా, ఆసుపత్రి కొనుగోళ్లలో తన అధికారాలను దుర్వినియోగం చేసి అక్రమంగా డబ్బులు కూడబెట్టారన్న ఆరోపణలపైనా దర్యాప్తు కొనసాగుతోంది. తాజా సోదాల్లో లభించిన ఆధారాలను విశ్లేషిస్తున్న ఏసీబీ అధికారులు.. లక్ష్మీభాస్కర్ ఆస్తులు, అనుమానిత బినామీల ఆర్థిక లావాదేవీల మధ్య ఉన్న సంబంధాలను పరిశీలిస్తున్నారు.




## ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన



**దుర్గి, ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 :** పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆడహల్లి ఆదేశాల మేరకు దుర్గి ఎస్సై బి. గోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం దుర్గి మెయిన్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బి. గోపాల్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, వేగాన్ని నియంత్రణలో ఉంచుకుని ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా నివారించవచ్చని ఎస్సై బి. గోపాల్ పేర్కొన్నారు.

## అటవీ సరిహద్దుల్లో అక్రమ మట్టి తవ్వకాలు..!

### AMR బిల్లుల మాటున మట్టి రవాణా?

### అధికారుల నిఘాపై స్థానికుల ప్రశ్నలు

**రాజుపాలెం మండల ప్రతినిధి ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 :** రాజుపాలెం మండలంలోని చౌటపాపాయపాలెం--బీరవల్లి పాయ అటవీ సరిహద్దు ప్రాంతాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు, తరలింపులు జరుగుతున్నాయంటూ స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన స్థాయిలో నిఘా పెట్టడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

### AMR బిల్లుల పేరుతో వాహనాల రాకపోకలు?

అటవీ సరిహద్దుల వద్ద AMR బిల్లులను చూపిస్తూ భారీ వాహనాలను రాకపోకలకు అనుమతిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ఆయా బిల్లులు ఏ ప్రాంతానికి, ఏ పనులకు సంబంధించినవో అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా



మట్టి తవ్వకాలు, తరలింపులు జరుగుతున్నాయా అనే అంశంపై సమగ్ర విచారణ జరగాలని అంటున్నారు.

### అధికారుల నిఘాపై ప్రశ్నలు

అటవీ సరిహద్దు ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు, భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో గ్రామపంచాయతీ, అటవీశాఖ అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. సహజ వనరులకు నష్టం వాటిల్లకుండా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



### విచారణకు స్థానికుల డిమాండ్

అటవీ సరిహద్దుల్లో జరుగుతున్నట్లు చెబుతున్న మట్టి తవ్వకాలు, రవాణాకు సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ వ్యవహారంపై సమగ్రంగా పరిశీలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## తుమ్మేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ ఎన్నిక






**మాచర్ల ప్రతినిధి,ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 :** మాచర్ల మండలం, రాయవరం, గ్రామం తుమ్మేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్యా నాయక్ అధ్యక్షతన ఎన్నికల సమావేశం జరిగింది. ముందుగా ఓటర్ల జాబితాను పరిశీలించి, అనంతరం కమిటీ సభ్యుల ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ అనంతరం కమిటీ చైర్మన్‌గా పూజ, వైస్ చైర్మన్‌గా పినపాటి ఏసోబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాచర్ల రూరల్ ఎస్సై నాగరాజు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి విద్యా కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు రత్యా నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పాఠశాల అభివృద్ధికి కమిటీ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ బ్రహ్మం, మాజీ వైస్ చైర్మన్ కోటేశ్వరి, ఉపాధ్యాయులు మేరీ ప్రశాంతి, నాసరయ్య, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ పాఠశాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని పలువురు ఆకాంక్షించారు.

## కంది, శనగ, మిర్చి సాగుపై రైతులకు శాస్త్రవేత్తల సూచనలు

### ప్రత్తి తర్వాత కంది సాగుతో మంచి దిగుబడులు..

### మిర్చిలో తెల్లదోమ నివారణకు జిగురు అట్టలు

**దుర్గి, ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 29 :** ఏరువాక కేంద్రం పల్నాడు జిల్లా ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. నగేష్, విస్తరణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.వి. సత్యగోపాల్, మండల వ్యవసాయాధికారి అమ్మిరెడ్డితో కలిసి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న వివిధ పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రస్తుతం చివరి దశలో ఉన్న ప్రత్తి పంటలో చివరి తీత పూర్తయిన వెంటనే అక్టోబర్ చివరిలోగా కంది సాగు చేపడితే ఆశాజనకమైన దిగుబడులు పొందవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. రెండు, మూడు నీటి తడులు అందించిన పరిస్థితుల్లో కంది నుంచి మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎల్‌ఆర్‌జీ-52, ఎల్‌ఆర్‌జీ-105, ఎల్‌ఆర్‌జీ-133-33 రకాలను సాగుకు అనుకూలమైనవిగా సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా 80



శాతం సబ్సిడీతో లభించే ఈ విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. తేలిక నేలల్లో వరుసల మధ్య మూడు అడుగులు, బరువు నేలల్లో నాలుగు అడుగుల దూరం ఉండేలా కంది విత్తుకోవాలని సూచించారు. ప్రస్తుతం సుమారు రెండు నెలల వయసున్న కంది పంటలో పోషక లోపాలను గుర్తించినట్లు తెలిపారు. నివారణకు లీటరు నీటికి అన్నబేది 5 గ్రాములు, నిమ్మ ఉప్పు అర గ్రాము, యూరియా 20 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రబీ సీజన్‌లో శనగ సాగు చేయాలనుకునే రైతులు నంద్యాల పరిశోధనా స్థానం నుంచి విడుదలైన ఎన్‌బీఈజీ-1267, ఎన్‌బీఈజీ-776 వంటి రకాలను సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ రకాలు ఎండు తెగులును తట్టుకోవడంతో పాటు యంత్రాలతో కోతకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. మిర్చి పంటలో తెల్లదోమ నివారణకు ఎకరానికి 20 పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే నాటిన 30, 60, 90, 120 రోజులలో ఎకరానికి 65 కిలోల యూరియాతో పాటు 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వినియోగిస్తే మొక్క ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. వేరు పురుగు నివారణకు తప్పనిసరిగా వేప పిండిని వినియోగించాలని సూచించారు. భూసార పరిరక్షణలో భాగంగా వామ్ జీవ ఎరువును ఎకరానికి ఐదు కిలోల చొప్పున వివిధ ద్రవరూప ఎరువులతో కలిపి చివరి దుక్కిలో వేసుకోవాలని తెలిపారు. దీనివల్ల నేలలో సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి భూసారం మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రంగానాయక్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## రూ.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

### పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం






**సత్తెనపల్లి నియోజకవర్గం ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 28 :** సత్తెనపల్లి రూరల్ మండలం కందులవారిపాలెం గ్రామంలో పల్లె పండుగ--3.0 కార్యక్రమంలో భాగంగా రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అవసరమైన రోడ్లు, డ్రైనేజీ తదితర సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### ప్రపంచ హృదయ దినోత్సవ అవగాహన కార్యక్రమశీ..

## ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

**ఐ ఎన్ బి టైమ్స్ సెప్టెంబర్ 28 : శేరిలింగంపల్లి ప్రతినిధి:** మాదాపూర్ డివిజన్ పరిధిలో గల గోకుల్ ప్లాట్స్ నందు గల డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ కార్యాలయ ఆవరణలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ(గుండె) దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని చందానగర్ లో గల ఓమెగ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ భానుకిరణ్ రెడ్డి, (కార్డియాలజిస్ట్) హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణంలో వచ్చే పెను మార్పులతో, మారిన జీవనశైలితో మానవుడు గుండె జబ్బులతో సతమవుతున్నాడు.గుండె జబ్బులు రోజురోజుకు అధికమవుతున్నాయి. దీనితో ప్రాణనష్టం, ఆర్థిక నష్టాలు జరుగుతున్నాయి.నష్ట నివారణకై ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ వారు సంయుక్తంగా 2011వ సంవత్సరము సెప్టెంబర్ 29 నుండి ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేకమైన నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ సంవత్సరం నినాదం డోంట్ మిస్ ఎ బీట్‌బిఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం గుండెను ఆరోగ్యంగా చూసుకోవడం, గుండెజబ్బుల వలన జరిగే అనర్థాలను, వ్యాధి లక్షణాలను నివారణపై అవగాహన కల్పించడమన్నారు. పిడికెడు గుండె మానవుని జీవితాన్ని నిర్దేశిస్తుందన్నారు.గుండె మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవము. యిది శరీరంలో ఛాతి, ఊపిరితిత్తుల మధ్య వుంటుంది. గుండె ఆక్సిజన్ పోషకాలను రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు సరఫరా చేస్తుందని అన్నారు.మారిన జీవనశైలి ఆహారపు అలవాట్ల వలన వయసు లింగభేదము లేకుండ ఎక్కువమంది గుండె సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు.గుండెలోని రక్త నాళాలలోని బ్లాకుల పూడికలు వలన రక్త ప్రసరణకు అవరోధం ఏర్పడి రక్తాన్ని గుండె సరఫరా చేయలేకపోతుంది. దీని ఫలితంగా (హార్ట్ ఎటాక్) గుండె పోటు వస్తుంది. వ్యాధి రావడానికి గల కారణాలు. మధుమేహము, బీ. పీ.,



అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవడం, వత్తిడి ఎక్కువగా ఉండటం, ధూమపానం. మద్యపానము సేవించడం వలన, అధిక కొవ్వు కలిగిన పదార్థాలతో పాటు మరియు మైదాతో తయారుచేసిన పదార్థాలు తీసుకోవడం వలన గుండెపోటు వస్తుందని అన్నారు.

### వ్యాధి లక్షణాలు:

ఛాతిలో ఆకస్మికముగా నొప్పి రావడం, అది మెడ వరకు ప్రాకడం, ఆకస్మిక మైకం. వికారం, శరీరమంతా చెమటలు పట్టి చల్లగా అయిపోయి యిబ్బంది పడటం, ఛాతిలో నొప్పి ప్రారంభమయి ఎడమ చేయి, ఎడమ దవడ.కుడి చేయివరకు యీ నొప్పి వ్యాపిస్తుంది. గుండె సంబంధిత సమస్యలు ఉంటే గుండె సాధారణం కంటే ఎక్కువగా కొట్టుకుంటుందని తెలియజేశారు. ఆరోగ్యమే మహాభాగ్యము కావున కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే మన ఆరోగ్యం మన చేతుల లోనే ఉంటుంది.

### నివారణ చర్యలు:

మధుమేహం. కొలెస్ట్రాల్ ను నియంత్రణలో పెట్టుకోవాలి. ధూమపానం మానేయాలి. శారీరక శ్రమ, వ్యాయామం, ధ్యానం, ప్రాణయామం, నడక వంటివి కనీసం 30 నిమిషాల పాటు చేయాలి. ఫాస్ట్ ఫుడ్, శీతల పానీయాలు. క్యాలరీలు అధికంగా వున్న ఆహార పదార్థాలను తీసుకోవడం మానేయాలి. అలాగే రెడ్ మీట్ ను కూడా




పూర్తిగా మానేయాలి.

### వంట నూనెలు తక్కువగా వాడాలి.

తాజా ఆకుకూరలు, సీజనల్ ఫ్రూట్స్, డ్రై ఫ్రూట్స్, మొలకలు, తృణధాన్యాలు, చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు వాడాలి. ప్రతిరోజు కనీసం 6 నుండి 7 గంటలు గాఢ నిద్ర పోవాలి. ఈ విధమైన జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. సంవత్సరానికి ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అలాగే 2డి ఏకో పరీక్షలు కూడా చేయించుకోవాల ని తెలిపారు. గుండెపోటు వచ్చినపుడు ఆస్పరిన్ ట్యాబ్లెట్ ను చప్పరించాలి. అవకాశం ఉన్న అన్ని సందర్భాలలో యిటువంటి అవగాహన కార్యక్రమాలలో పాల్గొని వ్యాధుల పట్ల అవగాహన పెంచుకొని వైద్యుల సూచనలు, సలహాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా బి. పీ.షుగర్ 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ నిర్వాహకురాలు చావ అరుణ. సిబ్బంది, మహిళలు, కాలనీ వాసులతో పాటు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామిరెడ్డి, బాలాజీ అలాగే హాస్పిటల్ ప్రతినిధులు జాకీర్ హుసేన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

